

రత్నగిరికి కొత్త శోభ

శ్రావణ మాసం సందర్భంగా రత్నగిరిపై పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. 'ప్రసాద్' నిధులతో నిత్య అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, టాయిలెట్ బ్లాక్‌లు నిర్మించనున్నారు.




నడిసంద్రాన సా'పాట్లు'

మత్స్య సంపద తగ్గిపోతున్న తరుణంలో మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలుగుతోంది. కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు ఆందోళన బాట పట్టారు.

8లో

2.38 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి 2,38,886 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం బుధవారం సాయంత్రం 10.90 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు 10,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రాజకీయ ప్రేరేపిత అరెస్టులు అన్యాయం

జెడ్పీ చైర్మన్ విప్పర్తి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో పాలన గాడి తప్పి ఎమెర్జెన్సీ నడుస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ విమర్శించారు. కక్ష సాధింపులతో కూటమి పాలన సాగుతోందన్నారు. బుధవారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎక్సైజ్ శాఖకు ఎటువంటి సంబంధం లేకున్నా అన్యాయంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. తప్పుడు ఆరోపణలు, బలవంతపు ఒప్పందాలు, అధికార దుర్వినియోగం ద్వారా కేసులు నమోదుచేయడం కుట్ర కోణాన్ని చెప్పకనే చెబుతోందన్నారు. మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. తప్పుడు కేసులో ఇరికించి ఇరుకున పెట్టడం చాలా బాధాకరమన్నారు. 2014–19లో మద్యం మాఫియా నడిచిందని, ఇప్పుడు కూడా అదే సాగుతోందని రాష్ట్రం కోడైకూస్తోందన్నారు. రాష్ట్రంలో 4,380 లిక్కర్ షాపులు, 43 వేల బెల్ట్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు ప్రైవేటు మాఫియాకు అప్పగించారన్నారు. ఇటువంటి వాస్తవాలు అన్నింటినీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కక్ష పూరిత రాజకీయాలకు ఇప్పటికైనా కూటమి సర్కార్ స్వస్తి పలికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంపై దృష్టి పెట్టాలని విప్పర్తి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇలా అక్రమ అరెస్టులకు పాల్పడటం సమంజసం కాదన్నారు.


'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీకి మరో అవార్డు



డిస్‌ప్లే చేసిన అవార్డుతో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుబ్బకృష్ణ స్మారక అవార్డు–2025 లభించింది. యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన వర్చువల్ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశంలో 19 గిరిజన భాషలకు లిపి అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మణిపూర్‌లోని ఇంఫాల్(నార్త్)లోని క్లాసిక్ హోటల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్‌ ఖ పాపులేషన్ ఎడ్యుకేషన్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి నారీ శక్తి అవార్డును, 2025కు నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డును ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రసన్నశ్రీని పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


అదనపు సిబ్బందిని నియమిస్తాం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గొట్టిపాటి

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ సంబంధిత ఇబ్బందులు పరిష్కరించేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. పారిశ్రామిక, వ్యాపార సంబంధ సమస్యలపై వెంటనే తనిఖీలు చేసి, పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆయన విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పనులు, ఆర్డీఎస్ఎస్ పనులపై ఆరా తీశారు. దరఖాస్తు చేసిన రైతులందరికీ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. గోదావరి పుష్కరాలకు విద్యుత్ అధికారులు ఇప్పటి నుంచి సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ వ్యవస్థపై కొందరు అపోహలు, గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి వరకు 75 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరని కుంపటి..!



- జనసేన, టీడీపీ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు
- నాడు మద్యం, ఇసుక వాటాల కోసం కయ్యం
- నామినేటెడ్ పదవుల్లో అన్యాయం జరిగిందంటూ గగ్గోలు
- తాజాగా ఫ్లెక్సీల గొడవ
- నిడదవోలులోనూ అదే పరిస్థితి



సాక్షి, రాజమహేంద్రవరం: కొవ్వూరులో కూటమి నేతల్లో నెలకొన్న అసమ్మతి కుంపటి చల్లారడం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయం నుంచి కొనసాగుతున్న వర్గ విభేదాలు నేటికీ అగ్నికి ఆజ్యం పోస్తూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే స్థానం కోసం మొదలైన కలహాలు.. మద్యం, ఇసుకలో వాటాలు, నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యమివ్వాలన్న కోణంలో కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సోషల్ మీడియా పోస్టులపై ఇరు వర్గాల నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ విమర్శించుకునే స్థాయికి వచ్చారంటే రాజకీయ రచ్చ ఏ స్థాయికి చేరిందో అవగతమవుతోంది.

జనసేన వర్సెస్ టీడీపీ

కొవ్వూరు నియోజకవర్గంలో ఇప్పటికే ఇసుక, మద్యం కేటాయింపుల విషయంలో జనసేన, టీడీపీ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇందుకు నామినేటెడ్ పోస్టుల భర్తీ అగ్నికి మరింత ఆజ్యం పోసింది. తాజాగా సొసైటీ పదవుల కేటాయింపుల్లో జనసేనకు టీడీపీ తీరని ద్రోహం చేసిందంటూ జనసేన నేతలు రోడ్డెక్కారు. స్వయంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు నేతృత్వంలో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. జనసేన నేతలకు ప్రాధాన్యమివ్వడం లేదని మండిపడ్డారు. ఇలాఉంటే అదే పార్టీలోని మరో వర్గం నేతలు మాత్రం తమకు ప్రాధాన్యం కల్పించారని, తాము కోరిన పదవులన్నీ ఇచ్చారంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికే ఎసరు పెట్టింది. క్రమశిక్షణ చర్యలో భాగంగా టీవీ రామారావుపై జనసేన అధిష్టానం వేటు వేసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో జనసేన రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇదిలా ఉంటే.. మద్యం, ఇసుక ర్యాంపుల్లో జనసేన నేతలకు వాటాలు ఇస్తున్నా.. కూటమి ధర్మానికి వ్యతిరేకంగా రోడ్డెక్కడం సరికాదన్న భావన టీడీపీ నేతల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ

స్వపక్షంలోనే విపక్షం అన్నట్టుగా మారింది టీడీపీ నియోజకవర్గ నేతల తీరు. ఓ వర్గంపై మరో వర్గం నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ విమర్శలు గుప్పిస్తుండటంతో పార్టీలో ఏం జరుగుతోందన్న మీమాంస పార్టీ అధిష్టానంలో నెలకొంది. పశివేదల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఫ్లెక్సీలను చించి వేయడం విభేదాలను మరింత పెంచింది. ఫ్లెక్సీలను చించేసిన వారిని 23లోగా అరెస్టు చేయాలని, లేని పక్షంలో 24న ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని జవహర్ వర్గం అల్టిమేటం జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన జవహర్ వ్యతిరేక వర్గం నేతలు.. జవహర్‌ను ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ ప్రెస్‌మీట్ పెట్టి మరీ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి పార్టీలో కీలక నేత అచ్చిబాబు వర్గంపై అనవసర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఫ్లెక్సీల చించివేతలో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. జవహర్ వర్గం మాత్రం అచ్చిబాబు వర్గానికి చెందిన వారే చించేశారన్న ఆరోపణలు చేస్తోంది. ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదాలు పార్టీకి తలనొప్పిగా పరిణమించినట్టు సమాచారం.

ఆది నుంచీ అదే తీరు

కొవ్వూరు నియోజకవర్గంలో బాబు సామాజిక వర్గానికి చెందిన నేతలదే పెత్తనం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నా.. అన్నీ పెండ్యాల అచ్చిబాబు చెప్పినట్టే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొవ్వూరు స్థానం మాజీ మంత్రి జవహర్‌కు తప్ప ఇతరులకు ఎవరికిచ్చినా.. తమకు ఓకే అంటూ పెద్దఎత్తున ప్రచారం చేశారు. అందుకు చంద్రబాబు స్పందించడం, గోపాలపురం నియోజకవర్గానికి చెందిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరు ఎమ్మెల్యే స్థానం కేటాయించడం వెనుక అచ్చిబాబే ఉండటాన్ని బట్టి చూస్తే.. తమ సామాజిక వర్గ నేతలకు కూటమి ప్రభుత్వంలో ఏ మేరకు ప్రాధాన్యమిస్తున్నారన్న విషయం అర్థమవుతోంది. ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి వచ్చినా.. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న జవహర్‌కు రెండు విడతల నామినేటెడ్ జాబితాల్లోనూ స్థానం దక్కలేదు. ఈ పరిణామం జవహర్ వర్గీయుల్లో ఆగ్రహావేశాలు నింపింది. పార్టీ జిల్లా అధ్యక్షుడికే దిక్కు లేకపోతే.. సామాన్య కార్యకర్తలకు ఏం న్యాయం జరుగుతుందన్న ప్రశ్న అప్పట్లో కార్యకర్తల్లో ఉత్పన్నమైంది. పార్టీ నేతలు, ప్రజల నుంచి కూటమిపై తీవ్ర అసహనం వ్యక్తమవడంతో తప్పదన్నట్టు ఎట్టకేలకు జవహర్‌కు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవికి ఎంపిక చేశారు.

నిడదవోలులోనూ అదే తీరు

కాగా నిడదవోలు నియోజకవర్గంలోనూ టీడీపీ, జనసేన నేతల మధ్య ఉన్న వైరం కొనసాగుతూనే ఉంది. ఇటీవల గోపవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు కందుల దుర్గేష్‌ను ఆహ్వానించలేదు. మాజీ ఎమ్మెల్యే శేషారావును మాత్రమే పిలిచారు. ఫ్లెక్సీల్లో సైతం దుర్గేష్ ఫొటో పెట్టలేదు. దీనిపై ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. మంత్రిని పిలవాలంటూ జనసేన నేతలు ప్రసార మాధ్యమాల్లో పెట్టడం చర్చనీయాంశంగా మారింది. జనసేన నేతలకు టీడీపీ నేతలు ప్రాధాన్యమివ్వడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తుండటం పరిపాటిగా మారింది. ఇలాఉంటే జనసేనలోనూ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. కల్యాణ్ చక్రవర్తి వర్గం హవా కొనసాగుతోంది. జనసేన పట్టణ అధ్యక్షుడు రంగారమేష్ మరో వర్గం. తమకు ప్రాధాన్యమివ్వడం లేదంటూ ఒకరికొకరు విమర్శలు ఎక్కుపెట్టుకోవడం పరిపాటిగా మారుతోంది. మంత్రి కందుల దుర్గేష్ కార్యక్రమాలకు సైతం తమను ఆహ్వానించడం లేదన్న అసంతృప్తి పట్టణ అధ్యక్షుడి వర్గంలో నెలకొన్నట్టు సమాచారం. పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేస్తే తమకు దక్కే గౌరవం ఇదేనా? అంటూ నిట్టూరుస్తున్నారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘన స్వాగతం

- టోల్‌గేట్ వద్దకు భారీగా చేరుకున్న నేతలు
- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్



పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



సెంట్రల్ జైల్ ఎదురుగా సమావేశమైన వైఎస్సార్ సీపీ కీలక నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం: లిక్కర్ స్కాంలో అక్రమ అరెస్టుకు గురై, రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ములాఖత్ అయ్యారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో బయలు దేరిన ఆయన రాజమహేంద్రవరం నగరంలో తాను తీసుకున్న ఇంట్లో కాసేపు కూర్చుని నేతలతో సమాలోచనలు చేశారు. అంతకు ముందు కొవ్వూరు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే.. అప్పటికే భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశరావు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వరకు భారీ కాన్వాయ్‌గా వచ్చారు. మంత్రి కారుమూరి, జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పెద్దాపురం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులు సెంట్రల్ జైల్ వద్దకు చేరుకున్నారు. పెద్దిరెడ్డి, వనిత, భరత్ ములాఖత్ అయ్యే వరకు అక్కడే కూర్చున్నారు. అనంతరం పెద్దిరెడ్డికి వీడ్కోలు పలికారు.

పోలీసుల ఆంక్షలు

పోలీసులు జైలు పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు అమలు చేశారు. మిథున్‌రెడ్డిని కలిసేందుకు వచ్చిన జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, మాజీ మంత్రి కారుమూరి, నేతలను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. జైల్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని నానా హంగామా చేశారు. మిథున్‌రెడ్డికి ఆహారం, దిండు, దుప్పట్లను తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. చివరకు న్యాయవాది కలుగజేసుకుని తీసుకెళ్లడంతో సమస్య సద్దుమణిగింది.

హైదరాబాద్‌కు పయనం

మధురపూడి: బుధవారం మధురపూడి విమానాశ్రయం నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్ అనంతరం ఆయన ఇండిగో విమానంలో బయలుదేరారు.

స్థిర భూగర్భ జల నిర్వహణపై శిక్షణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ. చిత్రంలో బోర్డు ఉన్నతాధికారులు

రాజానగరం: స్థిరమైన భూగర్భ జల నిర్వహణను నిర్ధారించడానికి యూనివర్సిటీలు, సాంకేతిక సంస్థల మధ్య శాస్త్రీయ, సమాజ ఆధారిత సహకారం ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సదరన్ రీజియన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో స్థిర భూగర్భ జల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని యూనివర్సిటీలో బుధవారం ప్రారంభించారు. 'గ్రౌండ్ వాటర్ సబ్‌స్టైనబుల్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఈస్ట్ గోదావరి' అనే అంశంపై మూడు రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందని వీసీ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ జ్యోతికుమార్, డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా భూగర్భ జలాన్వేషణ, రీచార్జ్ పద్ధతులపై పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

అచ్చెచ్చా.. ఇదేందచ్చన్నా!



- ఆడబిడ్డకు అన్యాయం చేస్తావా?
- హామీ అటకెక్కించేందుకు చంద్రబాబు మరో ఎత్తుగడా?
- మండిపడుతున్న మహిళా లోకం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా' అనే సామెత తెలుగుదేశంపార్టీ నేతలకు సరిగ్గా సరిపోతుంది. టీడీపీలో చంద్రబాబు దగ్గర నుంచి క్షేత్ర స్థాయిలో ద్వితీయ శ్రేణి నేత వరకు అందరూ ఒకే తీరున ఉన్నారనిపిస్తోంది. గద్దెనెక్కేందుకు సార్వత్రిక ఎన్నికల్లో ఎడాపెడా హామీలు గుప్పించిన చంద్రబాబు ఇప్పుడు వాటిని ఎగ్గొట్టేందుకు దారులు వెతుకుతున్నారు. మాట ఇవ్వడం.. మాట తప్పడంలో.. పేటెంట్ అంటూ ఉందంటే అది చంద్రబాబుకే సొంతమంటుంటారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నో హామీలను గాలికి వదిలేసి చేష్టలుడిగి చూస్తున్న చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కార్ తాజాగా తల్లికి వందనం అమలు చేసింది. ఈ పథకం అమలులో కూటమి ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెట్టింది. విద్యుత్ కనెక్షన్‌లు, ఆధార్ లింక్ మారిపోవడం, ఒక వినియోగదారుని విద్యుత్ సర్వీసు మరొకరికి మార్చేసిన నేపథ్యంలో వాటిని చక్కదిద్దుకోవడంలో అష్టకష్టాలు పడ్డారు. కొందరైతే ఈ బాధలు పడలేక మొత్తానికి ఆ పథకమే వద్దనుకున్నారు. ప్రస్తుతం ఏపీ ఈపీడీసీఎల్ నిర్వాకంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తక్కువలో తక్కువ లెక్కలేస్తే లక్షన్నర మంది విద్యార్థులకు తల్లికి వందనం జమ కాలేదని చెబుతున్నారు.

ఈ పథకానికి ఉన్న ప్రతిబంధకాలతో తల్లులు రోడ్డునపడి సతమతమవుతుంటే తాజాగా మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలతో ఆడబిడ్డ నిధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ 'ఆడబిడ్డ నిధి' కోసం నిరీక్షిస్తున్న పేద మహిళల ఆశలపై టీడీపీ నేతలు నీళ్లు చల్లారు. ఉత్తరాంధ్ర ముఖ్య నేత, కీలక మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు రెండు రోజుల తరువాత ఒక సమావేశంలో చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. ఈ పథకాన్ని అమలు చేస్తే ఆంధ్రాను అమ్మాలన్న సంచలన వ్యాఖ్యలతో ఆడబిడ్డ నిధి అమలు చేయలేమని పరోక్షంగా తేల్చి చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే అచ్చెన్న అలా అని ఉంటారని ఆ పార్టీ నేతల మధ్యనే చర్చ జరుగుతోంది. ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించినప్పుడు ఆడబిడ్డ నిధికి ఎంత వెచ్చించాలో నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు తెలియదా అని మహిళలు నిలదీస్తున్నారు.

సూపర్ సిక్స్‌లోని హామీని ఇప్పటివరకు అమలు చేయకుండా ఆడబిడ్డలకు చంద్రబాబు సర్కారు అన్యాయం చేసింది. తాజాగా ఈ హామీని అటకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ పథకం అమలుచేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ.. మంగళవారం విజయనగరంలో జరిగిన సభలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఇప్పటికే తల్లికి వందనం అమలులోను కూటమి అర్హులకు ఎగనామం పెట్టింది. జిల్లాలో అర్హులైన విద్యార్థులు 3 లక్షల మంది ఉండగా 2 లక్షలు మందికి మాత్రమే సాయం జమ అయ్యింది. ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు అందజేయాల్సి ఉండగా కొందరికి రాష్ట్ర వాటాగా రూ.8500 నుంచి రూ. 9000 మాత్రమే తల్లుల అకౌంట్లకు జమ చేసింది. కేంద్రం వాటా త్వరలో జమవుతుందని మెసేజ్‌లు పంపి చేతులు దులుపుకొన్నారు. కాగా ఆడబిడ్డ నిధి కి మంగళం పాడేలా మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలపై మహిళలు భగ్గుమంటున్నారు. ఎంత ఖర్చవుతుంది? పథకం అమలుకు ఆదాయ వనరులు ఏమిటి? అనే విషయం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే ముందు తెలియదా అని మహిళా సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చీ రాగానే 2024 జూన్ నుంచే 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న పేద మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని బాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వారిద్దరు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో ఊరూవాడ ఇదే విషయాన్ని ఊదరగొట్టారు. 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ' పేరిట ప్రజలకు అందించిన బాండ్లలో సైతం ఈ పథకం కింద ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరించారు. ఈ పథకం అమలుపై ఇంతవరకు అటు బాబు, ఇటు పవన్ ఇద్దరిలో ఏ ఒక్కరు పెదవి విప్పడం లేదు. ఈ ఏడాది అమలు చేస్తారనుకుంటుంటే మంత్రి అచ్చెన్నాయుడు ఇలా బాంబు పేల్చారని మహిళలు మండిపడుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ఇచ్చిన హామీని అటకెక్కిస్తారా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆడబిడ్డ నిధి కోసం అర్హులుగా 18 లక్షల పైచిలుకు మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇంత మందిని నిలువునా మోసం చేస్తారా అని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. 2014లో మాదిరిగానే డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కాక గాలికి వదిలేసినట్టే ఈ హామీని కూడా అటకెక్కించేస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారులు.. వారికి అందాల్సిన మొత్తం వివరాలు ఇలా..

జిల్లా	లబ్ధిదారులు (లక్షల్లో..)	అందాల్సిన లబ్ధి
కాకినాడ	7.37	రూ.1540 కోట్లు
తూర్పుగోదావరి	6.10	రూ.1230 కోట్లు
కోనసీమ	4.50	రూ. 810 కోట్లు

కూటమి ప్రభుత్వ రెండు నాల్కల ధోరణి దుర్మార్గం



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా రెండు నాల్కలతో మాట్లాడుతున్న కూటమి నాయకుల ధోరణి దుర్మార్గం. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చడం దారుణమైన విషయం. గత ప్రభుత్వ అమ్మ ఒడి పథకం పేరును తల్లికి వందనంగా మార్చి.. రూ.15 వేలకు రూ.11 వేలు మహిళల ఖాతాల్లో వేసి మోసం చేయడం సరైన విధానం కాదు. కూటమి పాలనలో మహిళలకు ఇస్తానన్న ఏ హామీ అమలు కాలేదు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వడంపై మాట్లాడుతూ రాష్ట్రాన్ని అమ్మేయాల్సి ఉంటుందనడం అత్యంత హేయమైన చర్య. మహిళలకు ఉచిత బస్సు అన్నారు. ఏడాది దాటినా ఇది అమలు కాలేదు. ఇలా మహిళలను కూటమి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసింది.

– జరీనా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం

అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆడబిడ్డ నిధి కోసం అర్హులుగా 18 లక్షల పైచిలుకు మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇంత మందిని నిలువునా మోసం చేస్తారా అని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. 2014లో మాదిరిగానే డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కాక గాలికి వదిలేసినట్టే ఈ హామీని కూడా అటకెక్కించేస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని కూటమి ఇచ్చిన హామీని అటకెక్కిస్తారా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆడబిడ్డ నిధి కోసం అర్హులుగా 18 లక్షల పైచిలుకు మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇంత మందిని నిలువునా మోసం చేస్తారా అని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. 2014లో మాదిరిగానే డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కాక గాలికి వదిలేసినట్టే ఈ హామీని కూడా అటకెక్కించేస్తారా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

మిథున్ రెడ్డి అరెస్టు ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబాసలామ్



సాక్షి, రాజమహేంద్రవరం: ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యానికి చీకటి రోజని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబాసలామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. కూటమి కుట్రలో భాగంగానే మిథున్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అబద్ధపు వాగ్దానాలు చేసిందన్నారు. వాటిని నిలబెట్టుకోలేక, ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. తప్పుడు కేసులు, అరెస్టులకు భయపడేది లేదని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు.

రాములోరి సాక్షిగా 'బెల్టు'కు వేలం

చినవలసలలో రూ.7 లక్షలకు ఖరారు!



చినవలసల గ్రామంలో మద్యం విక్రయాలకు నిర్వహిస్తున్న వేలం పాట

తాళ్లరేవు: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. గ్రామ స్థాయిలో మద్యాన్ని మరింత అందుబాటులోకి తెచ్చేందుకు అనధికారికంగా నిర్వహిస్తున్న వేలం పాటలకు సాక్షాత్తు రాములోరి ఆలయాన్ని వేదికగా చేయడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. శివారు మత్స్యకార గ్రామం గాడిమొగ పంచాయతీ చినవలసలలోని రామాలయంలో నిర్వహించిన వేలం పాటలో రికార్డు స్థాయిలో సుమారు రూ.7 లక్షలకు పాట ఖరారైనట్టు తెలిసింది. నూతనంగా ఎన్నికైన గ్రామ పెద్దల సమక్షంలో గంగాధరరావు అనే వ్యక్తి ఏడాది పాటు మద్యాన్ని విక్రయించుకునేందుకు ఈ పాట దక్కించుకున్నట్టు చెబుతున్నారు. మద్యం విక్రయాలకు పాట పెడుతున్నారని, పాడుకునేవారు రావాలంటూ చాటింపు వేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అటు పోలీసులు కానీ, ఇటు ఎక్సైజ్ అధికారులు కానీ పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మంగళవారం నిర్వహించిన వేలం విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు బయటపెట్టడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.



కాకినాడ తీర ప్రాంతం



వేట లేక ఉప్పుటేరులో లంగరు వేసిన బోట్లు

నడిసంద్రాన సాపాట్లు

- నన్నగిల్లుతున్న మత్స్యకారుల జీవనోపాధి
- కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్
- డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టిన మత్స్య కార్మిక, మత్స్యకార సంఘాల ఐక్యవేదిక

చేపల రుచులు చేదెక్కాయి. సాగర గర్భంలో పర్యావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండడంతో మత్స్య సంపదకు ముప్పు ఏర్పడుతోంది. ఈ క్రమంలో పాటు లేక.. పూట గడవని మత్స్యకారులు వలసబాట పడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, పెరిగిన డీజిల్ ధరలు వెరసి మత్స్యకారుల జీవన విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలను, తమ డిమాండ్లను 'కూటమి' పెద్దలు నెరవేర్చాలని మత్స్యకారులు ఆందోళన బాట పట్టారు.

పిఠాపురం: నిత్యం కాకినాడ హార్బర్‌తో పాటు, జిల్లాలోని వివిధ తీర ప్రాంతాల నుంచి గతంలో ప్రతి నెలా సుమారు 15,900 టన్నులకు పైగా చేపలు ఉత్పత్తి కాగా, రొయ్యలు 11 వేల టన్నులకు పైగా ఉత్పత్తి అయ్యేవి. ప్రస్తుతం చేపలు, రొయ్యల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. పారిశ్రామికీకరణ పేరుతో ఇష్టారాజ్యంగా సముద్రంలో తవ్వకాలు జరపడంతో పాటు, వ్యర్థాలను విచ్చలవిడిగా వదిలివేస్తుండడంతో సముద్ర గర్భంలో పర్యావరణం దెబ్బతింటోంది. కొన్ని రకాల నిషేధిత వలలు వేటకు విచ్చలవిడిగా ఉపయోగించడం వల్ల మత్స్య సంపద ఆదిలోనే అంతమవుతోంది. ముఖ్యంగా రింగు వలలు చేపల గుడ్లను సైతం వేటాడడం వల్ల మత్స్య సంపదకు శాపంగా పరిణమిస్తోంది. ఈ వలను నిషేధించినప్పటికీ, దీని అమలుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర పరిణామాలకు దారితీస్తోంది. చేపల వేట నిషేధ సమయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల విచ్చలవిడిగా సాగిన చేపల వేటతో మత్స్య సంపద గుడ్ల దశలోనే నాశనమవుతోంది. వివిధ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం నేరుగా సముద్రంలో కలుస్తుండడంతో, సముద్ర గర్భంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. తద్వారా కొన్ని మత్స్య రకాలు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కాలంలో టన్నుల కొద్దీ బరువైన తిమింగలాలు, సముద్ర తాబేళ్లు మత్స్యకారుల వలలకు చిక్కి, తీరానికి చేరడం సముద్ర పర్యావరణ అసమతుల్యతకు అద్దం పడుతున్నాయి.

కాకినాడ జిల్లాలో వివరాలిలా..

తీర ప్రాంతం	94 కిలోమీటర్లు
మత్స్యకారుల నివాస ప్రాంతాలు	58
మత్స్యకారులు	1,95,184
చేపల వేట సాగించే మత్స్యకారులు	36,101
చేపల వేట అనుబంధ రంగాల్లో జీవనోపాధి పొందేవారు	సుమారు 75 వేలు
ఫిష్ ల్యాండింగ్ సదుపాయాలున్న ప్రాంతాలు	23
మెకనైజ్డ్ బోట్లు	410
మోటరైజ్డ్ బోట్లు	3,732
సంప్రదాయ పడవలు	287

మత్స్యకారుల డిమాండ్లివీ..

- నష్ట పరిహారం రూ.11,500 ఇవ్వాలి.
- మత్స్యకారులకు రూ.50 లక్షల బీమా చేయించాలి.
- సముద్ర తీరంలో ఉన్న కంపెనీల్లో మత్స్యకారులకు 20 శాతం ఉద్యోగాలివ్వాలి.
- మత్స్యకారులను రైతులుగా గుర్తించి, డీసీసీబీ ద్వారా రుణాలు ఇవ్వాలి.
- సీఎస్సార్ నిధులు మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలి.
- సొసైటీలను పునరుద్ధరించి, పరికరాలకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి.
- మార్కెట్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి.

రిగ్గులతో మత్స్యకారులకు నష్టం



సముద్రంలో రిలయన్స్, ఓఎన్‌జీసీ రిగ్గుల వల్ల కాకినాడ జిల్లాలో అద్దరిపేట నుంచి గాడిమొగ వరకున్న తీర ప్రాంతంలో మత్స్యకారుల జీవితాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. సముద్రంలో కాలుష్యం పెరిగి, మత్స్య సంపద తగ్గి మత్స్యకారులు చేపల వేట సాగక తీవ్రంగా నష్టపోతున్నారు. తీరం వెంబడి ఉన్న వివిధ పరిశ్రమల వల్ల కాలుష్యం పెరిగి, చేపలు దొరక్క మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. ఇదే విషయమై గత ఎన్నికల్లో మా సమస్యలను కూటమి నేతల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటిచ్చారు. ఎన్నికలయ్యాక వాటిని విస్మరించారు. దీనిపై ఉద్యమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. మూడు రోజుల క్రితం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించాం. ఆయన అందుబాటులో లేకపోగా, ఆయన ఇన్‌చార్జి కూడా అందుబాటులో లేక పోవడంతో మేము ఆందోళన చేయాల్సి వచ్చింది. చివరకు మా వినతిపత్రం జనసేన నేతలు తీసుకున్నారు. వారు స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం. మా డిమాండ్లు అమలు చేసే వరకు ఉద్యమం ఆపేది లేదు.

– సీహెచ్ రమణి, ఏపీ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘం, ఆలిండియా కమిటీ మెంబర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కాకినాడ

పోరాటం ఉధృతం చేస్తాం

ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇచ్చాయి. ప్రధానంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు కానీ అమలు చేయడం లేదు. దీనిపై దశల వారీ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దానిని విస్మరించారు. ఇలాంటి చర్యలు కూటమి నేతలకు తగదు. పోరాటం మరింత ఉధృతం చేస్తాం.

– యు.సత్యనారాయణ, మత్స్యకార సంఘ నాయకుడు, కాకినాడ

డిమాండ్లు నెరవేర్చాలి



మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఆందోళన చేస్తాం. ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా పాలక యంత్రాంగం పెడచెవిన పెడుతోంది. ఇది చాలా దారుణం. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుంది. ఇప్పటికే తినడానికి తిండి లేక మత్స్యకారులు ఆకలితో అలమటిస్తున్నారు. కూటమి పాలకులు వెంటనే స్పందించి మత్స్యకారుల డిమాండ్లు నెరవేర్చాలి. లేకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేయాల్సి ఉంటుంది.

– సంగాడి ఈశ్వరరావు, మత్స్య కార్మిక సంఘం నాయకుడు, కాకినాడ

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- ఎల్ఐసీ ఎస్‌డీఎం సాహూ
- సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్, చెస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సాహూ. చిత్రంలో క్రీడాకారిణి అపూర్వ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని, క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎల్ఐసీ రాజమండ్రి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ అన్నారు. రాజమహేంద్రవరం సూర్య గార్డెన్స్‌లో బుధవారం ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్, చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ, విధి నిర్వహణలో బిజీగా ఉండే ఎల్ఐసీ ఉద్యోగులు ఇలాంటి పోటీలతో మానసికోల్లాసం, శారీరక ఆరోగ్యం పొందవచ్చన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 82 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు తెలిపారు. క్యారమ్స్ ప్రపంచ, జాతీయ చాంపియన్లు అపూర్వ, పి.నిర్మల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ అని నిర్వాహకులు చెప్పారు. క్యారమ్స్ అంతర్జాతీయ రిఫరీ షేక్ జలీల్, చెస్ అంతర్జాతీయ రిఫరీ జీవీ కుమార్ పర్యవేక్షణలో పోటీలు కొనసాగాయి. ఎల్ఐసీ పీఅండ్ఐఆర్ మేనేజర్ ఎం.పూర్ణచంద్రరావు, స్పోర్ట్స్ బోర్డు మెంబర్లు సురేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడికాయల మాటున పశువుల రవాణా



ఆటోలో గుమ్మడికాయల లోడు



ఆటోలో దాచి ఉంచిన పశువులు

కిర్లంపూడి: పైకి గుమ్మడికాయల లోడు కానీ.. అందులో పశువులను రవాణా చేస్తున్నారు. ఈ మినీ వ్యాన్ తుని నుంచి కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు వెళుతోంది. దీనిని బుధవారం స్వాధీనం చేసుకుని, కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు, మినీ వ్యాన్ తొట్టె భాగంలో రెండు ఆవులు, 8 ఎద్దులను ఎక్కించి, అవి లేవకుండా గట్టిగా తాళ్లతో రాడ్లకు కట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా వాటిపై చెక్కలు అమర్చి, గుమ్మడికాయల బస్తాల లోడు వేశారు. తమకు అందిన సమాచారంతో స్థానిక ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో మినీ వ్యాన్ పట్టుబడింది. పశువులను కృష్ణుడుపాలెంలో గోశాలకు అప్పగించి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

ఆటోలో తిప్పి.. తీవ్రంగా కొట్టి..

- ఆరుగురిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల వసూలు చేశారన్న వివాదంలో దళిత యువకుడితో పాటు, మున్సిపల్ మాజీ ఉద్యోగిని ఆరుగురు తీవ్రంగా హింసించిన ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బు వసూలు చేశారనే వివాదంలో అయినవిల్లి మండలం వెలవెలపల్లికి చెందిన అధ్యాపకుడు దోనిపాటి మహేష్, మున్సిపల్ మాజీ ఉద్యోగి సిరసపల్లి ఉదయశంకర్‌ను తమ డబ్బులు ఎప్పుడిస్తారంటూ ఆరుగురు నిందితులు ఆటోలో పలుచోట్ల తిప్పి, తీవ్రంగా కొట్టారు. అమలాపురం పట్టణం శ్రీరామపురానికి చెందిన యల్లమెల్లి విజయ్ రవిశంకర్, అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన ఉరదల బాలరాజు, విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన యర్రా కృష్ణను ఈ కేసులో ఇప్పటి వరకూ అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

పెద్ద సార్ మాట్లాడుతున్నారని..

మున్సిపాలిటీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఏడుగురు నిరుద్యోగుల నుంచి మున్సిపల్ మాజీ ఉద్యోగి సిరసపల్లి ఉదయశంకర్ రూ.లక్షల్లో వసూలు చేశాడు. అదిగో ఇదిగో ఉద్యోగమంటూ నిరుద్యోగులను మభ్య పెట్టాడు. వారిని నమ్మించేందుకు ఉదయ్‌శంకర్ 'పెద్ద సార్ మాట్లాతున్నార'ని దోనిపాటి మహేష్‌తో ఫోన్ మాట్లాడించాడు. పలుమార్లు ఫోన్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి, నిరుద్యోగులతో పాటు, నిందితులతో మాట్లాడించేవాడు. అప్పటికే మహేష్‌కు ఉదయ్‌శంకర్ డబ్బు ఇవ్వాల్సి ఉండగా, ఇలా పెద్ద సార్‌గా మాట్లాడితే వచ్చిన డబ్బుతో బాకీ ఇచ్చేస్తానని మహేష్‌ను నమ్మించాడు. ఇందులో భాగంగా నిందితులు యల్లమెల్లి విజయ్ రవిశంకర్ తదితరులు మహేష్‌కు ఫోన్ చేసి తాము చెప్పిన చోటికి రాకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో భయపడి మహేష్.. అప్పటికే బందీగా ఉన్న ఉదయ్‌శంకర్‌ను డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్న విజయ్ రవిశంకర్ బ్యాచ్ వద్దకు వచ్చారు. పేరూరు వై.జంక్షన్‌కు వచ్చిన మహేష్‌తో పాటు, ఉదయ్‌శంకర్‌ను బోడసకుర్రు గోదావరి గట్టు వద్దకు తీసుకెళ్లి, పగులగొట్టిన బీరు బాటిళ్లతో చంపేస్తామని బెదిరించారు. రబ్బరు ట్యూబ్, కర్ర, కొబ్బరి మట్టతో తీవ్రంగా కొట్టారు. అక్కడి నుంచి మరో రెండు చోట్లకు ఆటోలో తీసుకెళ్లి, ఇద్దరినీ చిత్రహింసలు పెట్టారు. అయితే ఉదయ్‌శంకర్ తప్పించుకోవడంతో, తీవ్ర గాయాలతో ఉన్న మహేష్‌ను వారు వదిలిపెట్టారు. కులం పేరుతో మహేష్‌ను నిందితులు దూషించారు. మహేష్ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ బృందం బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితుల నుంచి ఆటో, దాడికి వాడిన రబ్బరు ట్యూబ్, కొబ్బరి మట్టను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

వేర్వేరు చోట్ల మూడు మృతదేహాలు లభ్యం

తుని: వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మరణించారు. రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నర్సీపట్నం రోడ్డు–గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 50 ఏళ్లున్న వ్యక్తి రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుడిచేతిపై పచ్చబొట్టుతో దుర్గ అని హిందీలో రాసి ఉంది. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు.

సీతానగరం వద్ద..

జగ్గంపేట: మండలంలోని సీతానగరం గ్రామంలో పిల్ల కాలువ వద్ద సుమారు 80 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. తెల్ల చొక్కా, బూడిద రంగు లుంగీ ధరించి ఉన్నాడు. శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. అతడిని గతంలో చూడలేదని స్థానిక రైతులు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు జగ్గంపేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ద్వారపూడిలో..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి పాత లారీ యూనియన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సామర్లకోట కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మండపేట రూరల్ ఎస్సై వి.కిశోర్ వివరాల ప్రకారం.. సుమారు 35–50 ఏళ్ల పురుషుడుగా గుర్తించారు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96592, 94407 96537 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

శ్రావణంలో రత్నగిరికి కొత్త శోభ



శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం



ప్రసాద్ నిధులతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్ నమూనా

- పట్టాలెక్కనున్న 'ప్రసాద్' నిర్మాణాలు
- అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణాలకు త్వరలో శంకుస్థాపన

అన్నవరం: శ్రావణ మాసం సందర్భంగా రత్నగిరిపై పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' నిధులతో సత్యదేవుని నిత్య అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, టాయిలెట్ బ్లాక్‌లు తదితర నిర్మాణాలకు టూరిజం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పశ్చిమ రాజగోపురం వద్ద లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నిధులతో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిర్చ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీం టెండర్ గత వారం ఖరారైన సంగతి తెలిసిందే. రూ.18.98 కోట్ల వ్యయంతో చేపట్టే వివిధ నిర్మాణ పనులకు మూడో విడతగా మే నెలలో పిలిచిన నోటిఫికేషన్‌కు ఆరుగురు టెండర్లు దాఖలు చేయగా, రాజమహేంద్రవరానికి చెందిన గాలి సుబ్బరాజు అండ్ కంపెనీ 3.69 శాతం తక్కువకు టెండర్ దక్కించుకుంది. దీంతో 'ప్రసాద్' నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించేందుకు టూరిజం శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రావణ మాసంలో ఈ పనులు ప్రారంభించనున్నారు. టెండర్ ఖరారుకు ముందే టూరిజం శాఖ చీఫ్ ఇంజినీర్ ఈశ్వరయ్య అన్నవరం దేవస్థానానికి విచ్చేసి, ప్రసాద్ నిర్మాణాల స్థలాలకు జియో ట్యాగింగ్ చేసిన విషయం తెలిసిందే.

ప్రసాద్ స్కీం నిర్మాణాలివీ..


- రూ.11.09 కోట్ల వ్యయంతో పాత టీటీడీ భవనం పక్కనే రెండంతస్తుల అన్నదాన భవనం
- ప్రస్తుత అన్నదాన భవనం పక్కనే రూ.5.9 కోట్ల వ్యయంతో క్యూ కాంప్లెక్స్
- ప్రకాష్ సదన్ భవనం వెనుక ప్రస్తుతం పార్కింగ్ స్థలంగా వాడుతున్న ప్రదేశంలో అటు సత్యగిరి, ఇటు రత్నగిరికి దగ్గరగా రూ.61.78 లక్షల వ్యయంతో నిర్మించనున్న టాయిలెట్స్ బ్లాక్‌లు
- రూ.1.08 కోట్ల వ్యయంతో వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్
- రూ.91.96 లక్షల వ్యయంతో భక్తుల క్యూ కాంప్లెక్స్ ప్రహరీ

ఇవే కాకుండా ప్రసాద్ నిధులతో దేవస్థానానికి రూ.కోటి వ్యయంతో రెండు బ్యాటరీ కార్లు కూడా మంజూరు చేశారు. వీటిని దేవస్థానంలో సత్రాల నుంచి స్వామివారి ఆలయం, వ్రత మంటపాల మధ్య భక్తులను తరలించేందుకు ఉపయోగించనున్నారు.

పశ్చిమ రాజగోపురం వద్ద..

కాగా, విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నిధులతో పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు కూడా ఈ శ్రావణ మాసంలోనే ప్రారంభించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో వంద అడుగుల పొడవు, 175 అడుగుల వెడల్పున టెన్సిల్ షెడ్డు నిర్మించేందుకు లారెస్ కంపెనీ సంసిద్ధత తెలిపిందని అధికారులు చెప్పారు. మంచిరోజు చూసి పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

శంకుస్థాపనకు ఏర్పాట్లు



అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ నిధులతో వివిధ నిర్మాణాలకు శ్రావణ మాసంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నిస్తున్నాం. అనంతరం నిర్మాణాలు వేగంగా కొనసాగించి, రెండేళ్లలోపు పూర్తి చేస్తాం.

– ఈశ్వరయ్య, చీఫ్ ఇంజినీర్, టూరిజం శాఖ